క్లుప్తంగా...

కర్ణాటక డిప్యూటీ సీఎంకి ఘన స్వాగతం



శివకుమార్‌తో ప్రొటోకాల్ చైర్మన్ వేణుగోపాల్

శంషాబాద్: ఎన్నికల ప్రచారంలో భాగంగా వచ్చిన కర్ణాటక రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి డీ.కే శివకుమార్‌కు ఎయిర్‌పోర్టులో ఘనస్వాగతం పలికారు. రాష్ట్ర కాంగ్రెస్ ప్రొటోకాల్ చైర్మన్ హర్కర వేణుగోపాల్ ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఆయన పరిగి, తాండూరు, వికారాబాద్ నియోజకవర్గాల్లో ప్రచారం కోసం బయలుదేరి వెళ్లారు. ఆయా ప్రాంతాల నేతలు కూడా ఎయిర్‌పోర్టులో శివకుమార్‌కు స్వాగతం పలికారు.

బీసీ సీఎం ప్రకటనపై హర్షం



సుల్గే వెంకటేష్

అత్తాపూర్: బీజేపీ పార్టీ తెలంగాణలో అధికారంలోకి వస్తే బీసీ వ్యక్తిని సీఎం చేస్తామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా సూర్యాపేట బహిరంగ సభలో ప్రకటించడం బీసీ నాయకులు హర్షించదగ్గ విషయమని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సుల్గే వెంకటేష్ హర్షం వ్యక్తం చేశారు. బీజేపీ పార్టీ బీసీలకు సముచిత స్థానం కల్పిస్తూ.. ఎక్కువ టికెట్లను బీసీలకు కేటాయించడం మంచి పరిణామన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో బీసీ కమిషన్ ఏర్పాటు చేసి చట్టబద్ధత కల్పించడం, బీజేపీ బీసీ నాయకులకు తగిన ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో ఉన్న బీసీ ప్రజలు బీజేపీకి ఓటు వేసి అధికారంలోకి తీసుకురావాలని కోరారు.

6 ఫుల్.. 12 బీర్లు మాత్రమే !

రాజేంద్రనగర్: ఎన్నికల నియమావళి అమల్లోకి రావడంతో డబ్బు రవాణాపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. రూ.49 వేల కంటే ఎక్కువగా ఒకరి వద్ద ఉంటే వాటిని స్వాధీనం చేసుకుని ట్రెజరీలకు జమ చేస్తున్నారు. సంబంధిత పత్రాలను అందిస్తేనే తిరిగి ఇస్తున్నారు. అదే మద్యాన్ని రవాణా, అక్రమంగా డంప్, అనుమతి లేకుండా విక్రయించినా స్వాధీనం చేసుకుంటున్నారు. ఒక వ్యక్తి 6 ఫుల్ బాటిళ్లు, 12 బీరు బాటిళ్లను మాత్రమే తీసుకెళ్లేందుకు ఎన్నికల నియమావళి ఉంది. అతిక్రమించిన వారిపై ఎక్సైజ్ శాఖ కేసు నమోదు చేస్తారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: జయభేరి విద్యుత్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు గచ్చిబౌలి ఏఈ వేణుగోపాల్ తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఏపీహెచ్‌బీ కాలనీ, డాగ్ పార్కు ప్రాంతం, రాడిసన్ హోటల్, లీ మెరీడియన్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

ఐ బొటిక్ ప్రారంభం



గచ్చిబౌలి: ఇప్పటి వరకు మార్కెట్‌లో స్మార్ట్ ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు సందడి చేశాయి, ఇప్పుడు కొత్తగా ఐబొటిక్ లగ్జరీ సన్ గ్లాసెస్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. హైటెక్‌సిటీ ప్రాంతంలో నిర్వాహకులు డాక్టర్ జగదీశ్‌రెడ్డి, ప్రణతిరెడ్డి, డాక్టర్ హేమలత ఆధ్వర్యంలో ఈ బొటిక్‌ను సినీ ప్రముఖులు, మోడల్స్‌తో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ లగ్జరీ బ్రాండ్‌లు అందుబాటులో ఉంటాయన్నారు.

5జీ యూజ్ కేస్ ల్యాబ్ సంబరాలు

రాయదుర్గం: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన 5జీ యూజ్ కేస్ ల్యాబ్ టాప్-100 సంస్థలలో గచ్చిబౌలిలోని ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌కు అవకాశం కల్పించారు. దేశంలోని టాప్-100 ఇన్‌స్టిట్యూట్‌లలో ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ ఉండడం విశేషం. దీంతో ట్రిపుల్ ఐటీ ఫ్యాకల్టీ, విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. కాగా ట్రిపుల్ ఐటీ హైదరాబాద్‌లోని స్మార్ట్ సిటీ లివింగ్ ల్యాబ్‌కు చెందిన లీడ్ ఆర్కిటెక్ట్ అనురాధ వట్టెం 5-జీ యూజ్ కేస్ ల్యాబ్‌పై ప్రత్యేక ప్రదర్శన నిర్వహించారు.

ఘనంగా వాల్మీకి జయంతి

గోల్కొండ: వాల్మీకి జయంతిని కార్వాన్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కురాకుల కృష్ణ, కిషన్, షకీలా, గోవర్ధన్‌రెడ్డి, ముంగి రఘుపాల్‌రెడ్డి, చంద్రశేఖర్, చంటిబాబు తదితరులున్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన





అధికారులతో కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర

- అధికారులు, సిబ్బందికి పలు సూచనలు
- అత్యధికంగా ప్రభుత్వ పాఠశాలలే పోలింగ్ కేంద్రాలు

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పోలింగ్ స్టేషన్‌లను కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర సందర్శించారు. ఈ సందర్భంగా శనివారం వివిధ శాఖల అధికారులు, సిబ్బందికి కమిషనర్ పలు సలహాలు సూచనలు అందజేశారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన కేంద్రాలను ముమ్మరంగా తనిఖీలు చేయడంతో పాటు అన్ని రకాల సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం..

పోలింగ్ స్టేషన్ వద్ద ఓటు వేసేందుకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నామని కమిషనర్ శరత్‌చంద్ర అన్నారు. టాయిలెట్స్, లైట్స్, వెంటిలేషన్, ర్యాంప్ తదితర ఏర్పాట్లు చేయనున్నామన్నారు. దివ్యాంగులు ఓటు వినియోగించుకునేందుకు వీల్‌చైర్స్ అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. పరిసరాలను శుభ్రంగా ఉంచి ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూస్తామన్నారు. అన్ని రకాల సదుపాయాల కల్పనపై ఉన్నతాధికారులు సమీక్షిస్తున్నారన్నారు. డిప్యూటీ ఈఈ యాదయ్య, ఏఈ రాజ్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేష్, టౌన్‌ప్లానింగ్ సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, వార్డు ఆఫీసర్ శ్రీశైలం, శంకరయ్య, సూర్యప్రకాష్, వెంకటప్ప, కిష్టయ్య, జగదీశ్వరి, వర్క్ ఇన్‌స్పెక్టర్ వినయ్ తదితరులున్నారు.

అధికారులు సందర్శించిన పోలింగ్ కేంద్రాలు..

హిమాయత్‌సాగర్ ఎంపీ యూపీఎస్ ప్రభుత్వ పాఠశాల, దర్గాఖలీజ్‌ఖాన్ ఎంపీపీఎస్, కస్తూర్బా పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, కిస్మత్‌పూర్ ఎంపీపీఎస్ పాఠశాల, బండ్లగూడ ఎంపీపీఎస్, బండ్లగూడ వార్డు ఆఫీస్, శివాజీ యూత్ బిల్డింగ్, డాన్ బాస్కో పాఠశాల, అభ్యుదయ నగర్ కమ్యూనిటీహాల్, పీఅండ్‌టీ కాలనీ హిదయ స్కూల్, గంధంగూడ అంగన్‌వాడీ కేంద్రం, ఎంపీపీఎస్ పాఠశాల, గ్లోబల్ డిస్కవరీ పాఠశాల, హైదర్షాకోట్ ఎంపీపీఎస్, జెడ్‌పీహెచ్‌ఎస్ పాఠశాలలు, పీరంచెరువు ఎంపీపీఎస్, అంగన్‌వాడీ కేంద్రాల పోలింగ్ స్టేషన్‌లను వివిధ శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు.

‘సంక్షేమానికి కేరాఫ్‌గా కాంగ్రెస్’



శుభాకాంక్షలు తెలుపుతున్న స్థానిక కాంగ్రెస్ నేతలు

మణికొండ: పేదలకు అందాల్సిన పథకాలు సరిగ్గా అందడం లేదని, సంక్షేమం అంటే కేరాఫ్ కాంగ్రెస్ పార్టీ అనే నమ్మకం ప్రజల్లో ఉందని, నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు మద్దతుగా నిలిచేందుకు సిద్ధంగా ఉన్నారని, వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని రాజేంద్రనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి కస్తూరి నరేందర్‌ముదిరాజ్ అన్నారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ తనకు ఎమ్మెల్యే టికెట్‌ను ఖరారు చేయడంతో శనివారం ఆయన అభిమానులు, పార్టీ నాయకులు, సానుభూతి పరులు పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలిపి, తమ మద్దతును ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంలో అర్హులైన వారందరికీ ఇళ్ల స్థలాలు, రేషన్‌కార్డులు, పెన్షన్‌లు, పరిహారాలను అందించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలు వచ్చినప్పుడే వాటి గురించి మాట్లాడి తర్వాత మర్చిపోతుందని ఆరోపించారు. ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, వారి ఆశీర్వాదంతో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి తీరుతుందని ధీమా వ్యక్తం చేశారు.

జ్ఞానేశ్వర్ మద్దతుతోనే..

రాజేంద్రనగర్ కాంగ్రెస్ పార్టీలో జ్ఞానేశ్వర్ సీనియర్ నాయకుడని, ఆయన మద్దతు తప్పనిసరిగా కోరతామని, అయన అండతోనే ఎన్నికల్లో పోటీ చేస్తానని కస్తూరి నరేందర్ ప్రకటించారు. ఎమ్మెల్యే టికెట్ రేసులో ఎంతో మంది ఉంటారని, అందరికీ పార్టీ టికెట్లను ఇవ్వలేదని, ఇచ్చిన వారికి అండగా నిలిచి పార్టీ విజయానికి కృషి చేయాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్త, నాయకుడిపై ఉంటుందన్నారు. జ్ఞానేశ్వర్ అదే తరహాలో తమకు మద్దతు ఇచ్చి అండగా నిలిచి సోదరుడిలా ముందుండి విజయానికి కృషి చేస్తారన్నారు. కాంగ్రెస్ పార్టీ మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షుడు జితేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కిరణ్‌కుమార్, మహిళా అధ్యక్షురాలు ఇందిరాబాల్‌రెడ్డి, కౌన్సిలర్లు పురుషోత్తం, పద్మారావు, లక్ష్మీనారాయణ, ఆల్ కాలనీస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, పలు కాలనీల సంక్షేమ సంఘాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యవర్గసభ్యులు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



కొత్వాల్‌గూడ వాసులతో ఎమ్మెల్యే అభ్యర్థి

కాంగ్రెస్ అభ్యర్థికి శుభాకాంక్షలు

శంషాబాద్: రాజేంద్రనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా ఖరారైన కస్తూరి నరేందర్‌ముదిరాజ్‌ను కొత్వాల్‌గూడ కాంగ్రెస్ నేతలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో కాంగ్రెస్ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ నేతలంతా సమన్వయంగా పనిచేసి భారీ మెజార్టీని అందించాలని ఆయన సూచించారు. కాంగ్రెస్ యూత్ నాయకులు సురేష్ ముదిరాజ్, పూర్ణ చంద్రముదిరాజ్, సుబ్బారెడ్డి, యాదగిరిముదిరాజ్ తదితరులున్నారు.

అభివృద్ధి పనులను కొనసాగించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

మణికొండ: నియోజకవర్గంలో వందల కోట్ల నిధులతో అభివృద్ధిలో శరవేగంగా దూసుకువెళ్తుందని, దాన్ని భవిష్యత్తుల్లో కొనసాగించాలని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. మణికొండ పోస్టాఫీస్ పక్కన నూతన పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశంలోనే ఎక్కడా లేని సంక్షేమ పథకాలు, రాష్ట్రంలో అన్ని రకాల అభివృద్ధితో అగ్రభాగంలో నిలిచిందన్నారు. ప్రతి ఇంటికి అందిన సంక్షేమ పథకాలతో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా జరిగిన అభివృద్ధిని వివరించి వచ్చే ఎన్నికల్లో ఓటు అడగాలని ఆయన నాయకులు, కార్యకర్తలకు సూచించారు. నియోజకవర్గంలో గెలుపు ఖరారయ్యిందని, కేవలం మెజార్టీ కోసమే ప్రయత్నం చేయాలన్నారు. కార్యకర్తలు పార్టీ గెలుపు కోసం నిర్విరామంగా కృషి చేయాలన్నారు. బీఆర్ఎస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీరాములు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కె. రామకృష్ణారెడ్డి, కౌన్సిలర్లు పి.శైలజ, కావ్య శ్రీరాములు, యాలాల లావణ్య నరేష్, నవీన్‌కుమార్, పార్టీ సమన్వయకర్త, మాజీ ఎంపీపీ తలారి మల్లేష్, మహిళా అధ్యక్షురాలు రూపారెడ్డి, నాయకులు సీతారాం, కుమార్, శ్రీకాంత్, ప్రభావతి, విజయలక్ష్మి, శివగంగ, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సత్కారం



ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌కు జ్ఞాపికను అందజేస్తున్న దృశ్యం

అత్తాపూర్: అత్తాపూర్ రాంబాగ్‌లోని శ్రీరామ మందిరంలో మహారాణా ప్రతాప్ సేవా సమితి అత్తాపూర్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శనివారం ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజ్‌పుత్ కమ్యూనిటీ ప్రజల కోసం కమ్యూనిటీహాల్, రాజపుత్ర విగ్రహ నిర్మాణానికి భూమికి కేటాయిస్తామని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ హామీ ఇచ్చారన్నారు. కమిటీ చైర్మన్ ఠాకూర్ అర్జున్ సింగ్, న్యాయ సలహాదారులు ఠాకూర్ గోపాల్‌సింగ్, సలహాదారులు నర్సింగ్‌ఠాకూర్, కమిటీ వ్యవస్థాపక అధ్యక్షులు విజయ్ దినేశ్‌సింగ్, కోశాధికారి ఠాకూర్ నరేంద్రసింగ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు జ్ఞాపిక, శాలువాతో ఘనంగా సత్కరించారు.

వెంకట్‌రావు ప్యానల్ ఘన విజయం



విజేతలను సత్కరించిన కాలనీవాసులు

శేరిలింగంపల్లి: భెల్ ఎంఐజీ ఎంప్లాయిస్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ఎన్నికలు శనివారం ప్రశాంతంగా ముగిశాయి. భెల్ ఎంఐజీ కాలనీలో నిర్వహించిన పోలింగ్‌లో పి వెంకట్‌రావు(ఎంఎల్‌ఏ) ప్యానెల్ ఘన విజయం సాధించింది. ఈ సొసైటీ ఎన్నికలలో ఎస్సీ, ఎస్టీ కేటగిరి ఒక పోస్టుకు జరిగిన పోటీలో చింతా రాములు కమిటీ సభ్యుడుగా 140 ఓట్లు సాధించి విజయం సాధించారు. జనరల్ కేటగిరిలో 9 మంది పోటీ పడగా నలుగురు విజయం సాధించారు. వారిలో పి వెంకట్‌రావు(ఎంఎల్‌ఏ) 108 ఓట్లు, కెవిసుబ్బారావు 104 ఓట్లు, ఎస్ నారాయణ 101 ఓట్లు, ఎం నీలకంఠరావు 97 ఓట్లు సాధించారు. కాగా నీలకంఠరావు, బాలయ్య ఇద్దరికీ 97 ఓట్లు సమానంగా రావడంతో టాస్ వేయగా విజయం నీలకంఠరావును వరించింది. అనంతరం కాలనీవాసులు విజేతలకు శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా కొమురం భీమ్ 83వ వర్ధంతి



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్



కార్పొరేటర్ సంగీత గౌరీశంకర్ మహిళా నేతలు

అత్తాపూర్: మా ఊరులో మా పాలన కావాలన్నదే లక్ష్యంగా పెట్టుకుని అడవి బిడ్డల కోసం సుదీర్ఘకాలం పోరాటం చేసిన మహనీయుడు కొమురం భీమ్ అని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. కొమురం భీమ్ 83వ వర్ధంతి సందర్భంగా ఎస్టీ తోటి బస్తీ కమ్యూనిటీహాల్‌లో శనివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 1920కు ముందుగానే గిరిజన కొండ ప్రాంతాల నుంచి రూ.10 లక్షలు నిజాం సర్కార్‌కు ట్యాక్స్ రూపంలో కట్టేవారన్నారు. అటవీ ప్రాంతంలో పండించిన పంటకు గిట్టుబాటు ధరలేక దళారులు ఇష్టానుసారంగా గిరిజనులను దోచుకునేవారన్నారు. భజనగిరి కొండల్లో జరిగిన పోరాటంలో వీరమరణం పొందిన కొమురం భీమ్‌కు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. తోటి సేవా సంఘం నాయకులు మడారి కృష్ణ, శ్రీనివాస్, నరసింహ, గోవింద్, సోయం కృష్ణస్వామి, గుర్రం లక్ష్మయ్య, లచ్చుం, సోయం జంగేశ్వర్, రేణుక, ఎం.సుశీల, కె.స్వాతి, అంజమ్మ, ఎ.లలిత, తారమ్మ తదితరులున్నారు.

గొప్పయోధుడిగా చరిత్రపుటల్లో..

అత్తాపూర్: నిజాం సర్కార్‌తో పోరాడి తన జాతి కోసం వీర మరణం పొందిన గొప్ప యోధుడిగా చరిత్రపుటల్లో నిలిచిన వ్యక్తి కొమురం భీమ్ అని కార్పొరేటర్ మోండ్ర సంగీత గౌరీశంకర్ అన్నారు. మహిళలు ఆర్థికంగా అన్ని రంగాల్లో రావాలన్నదే లక్ష్యంగా పెట్టుకుని బీజేపీ పార్టీ పని చేస్తుందని పేర్కొన్నారు. అత్తాపూర్ ఎస్టీ తోటి బస్తీ కమ్యూనిటీ హాల్ వద్ద జరిగిన కొమురం భీమ్ వర్ధంతి కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... నాయకులు జ్యోతి, రేణుక, సుశీల, తారమ్మ, మంజు తదితరులున్నారు.

ఉల్లాసంగా సైకిల్‌రైడ్



రాయదుర్గం: గచ్చిబౌలిలోని హైదరాబాద్ బైసైక్లింగ్ స్టేషన్ నుంచి వీకెండ్ రైడ్ శనివారం ఉదయం 5.30 గంటలకు ప్రారంభమైంది. ఎస్కేప్ అండ్ ఎక్స్‌ప్లోర్ టీమ్ ఆధ్వర్యంలో హెచ్‌బీసీ బైసైక్లింగ్ స్టేషన్ నుంచి 30 కిలోమీటర్ల సైకిల్‌రైడ్‌ను గండిపేట్ వరకు నిర్వహించారు. ఎస్కేప్ అండ్ ఎక్స్‌ప్లోర్ వ్యవస్థాపకుడు అశోక్ మాట్లాడుతూ వీకెండ్‌లో సైక్లింగ్ ఉంటుందని, ఔత్సాహికులంతా పాల్గొనాలని సూచించారు. హెచ్‌బీసీ బైసైక్లింగ్ స్టేషన్ వద్ద ప్రారంభమైన సైకిల్ రైడ్ బయోడైవర్సిటీ పార్కు కూడలి, సైబరాబాద్ కమిషనరేట్, గచ్చిబౌలి కూడలి, ట్రిపుల్‌ఐటీ కూడలి, ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ మీదుగా విప్రో సర్కిల్, కోకాపేట్ గండిపేట్, ఓఆర్ఆర్ సైక్లింగ్ ట్రాక్ మీదుగా పుప్పాలగూడ వరకు నిర్వహించి అదే మార్గంలో తిరిగి హెచ్‌బీసీ సైక్లింగ్ స్టేషన్ వరకు రైడ్ నిర్వహించారు.

‘బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం’

గోల్కొండ: రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ కార్వాన్ నియోజకవర్గ అభ్యర్థి టి.అమర్‌సింగ్ అన్నారు. శనివారం కార్వాన్ నియోజకవర్గానికి చెందిన పలువురు బీజేపీ నాయకులు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా వారు తమవెంట పలు ఇతర పార్టీల కార్యకర్తలను తీసుకొచ్చి అమర్‌సింగ్‌కు పరిచయం చేశారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం అమర్‌సింగ్ మాట్లాడుతూ.. తెలంగాణ పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో 20 ఏళ్లు వెనక్కి పోయిందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ గుడిమల్కాపూర్ డివిజన్ అధ్యక్షులు సునీల్‌యాదవ్, టోలిచౌకీ బీజేపీ అధ్యక్షుడు బి.శ్రీకాంత్‌చారి, నర్సింహ, మహేశ్వర్, విజయసింగ్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూలో క్లీనప్ డ్రైవ్



రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని నేషనల్ సర్వీస్ స్కీమ్(ఎన్ఎస్ఎస్) సెల్ ఆధ్వర్యంలో శనివారం క్యాంపస్‌లో క్లీనప్ డ్రైవ్‌ను నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ సెల్ హెచ్‌సీయూ కోఆర్డినేటర్ ఆధ్వర్యంలో వాలంటీర్లు, శానిటేషన్, హార్టికల్చర్ విభాగాల సహకారంతో చెత్తాచెదారం, ఆకులు, విరిగిపోయిన చెట్లకొమ్మలు, పిచ్చిమొక్కలను తొలగించారు. అనంతరం ఆయా ప్రాంతాలలో శుభ్రం చేశారు. సేకరించిన వ్యర్థాలు, చెత్తాచెదారాన్ని ట్రాక్టర్ ద్వారా చెత్త డంపింగ్‌యార్డ్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ బి కృష్ణయ్య హెచ్‌సీయూను క్లీన్ క్యాంపస్‌గా మార్చడమే లక్ష్యంగా పెట్టుకొని పనిచేస్తున్నామన్నారు. ఎన్ఎస్ఎస్ సెల్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ భీంసింగ్, అరుణ, శ్రీవాణి, సాయిఅఖిల, దివ్య, అన్వేష్, అజయ్‌ప్రకాశ్, వెంకటేష్, మహ్మద్ జునైద్, అభిలాష్, ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

విజయనగర్‌కాలనీ: టప్పాచబుత్ర పోలీస్‌స్టేషన్ పరిధిలోని కార్వాన్ గణేష్‌ఘాట్ వద్ద శనివారం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఒసామా బిన్ అల్ హాజారి కారును పోలీసులు తనిఖీ చేశారు. కుల్సుంపురా ఏసీపీ ఎం.ఏ. జావేద్, ఇన్‌స్పెక్టర్ సీహెచ్. శ్రీనివాస్ పాల్గొన్నారు.

భవానీనగర్ స్టేషన్ పరిధిలో..

గౌలిపురా: అసెంబ్లీ ఎన్నికలను పురస్కరించుకొని భవానీనగర్ పోలీసులు శనివారం స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో వాహనాల తనిఖీలు చేపట్టారు. భవానీనగర్ ఇన్‌స్పెక్టర్ రవీందర్ ఆధ్వర్యంలో స్టేషన్ పరిధిలోని ఓల్డా హోటల్ తదితర ప్రాంతాల్లో ఎస్సైలు, సిబ్బంది వాహనాలను తనిఖీలు చేపట్టారు.

బెటాలియన్‌లో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న పోలీసులు

గచ్చిబౌలి: పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా హైదరాబాద్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో కొండాపూర్ 8వ బెటాలియన్‌లో శనివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమాండెంట్ సి.సన్నీ మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల విలువైన వ్యక్తుల ప్రాణాలను కాపాడవచ్చన్నారు. అన్ని దానాల కంటే రక్తదానం గొప్పదని ఆయన పేర్కొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రాణాలు అర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలను కొనియాడారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ సుబ్రహ్మణ్యం, అసిస్టెంట్ కమాండెంట్లు నర్సింహస్వామి, సత్యనారాయణ, నారాయణదాస్, యూనిట్ మెడికల్ ఆఫీసర్ జ్యోతిబా ఫులే, రెడ్ క్రాస్ సొసైటీ మెడికల్ ఆఫీసర్ జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి చేరికలు



శివముదిరాజ్‌ను కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి నరేందర్

రాజేంద్రనగర్: బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, తెలంగాణ ప్రైవేటు ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ శివముదిరాజ్ తన అనుచరులతో కలిసి కస్తూరి నరేందర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా శనివారం కస్తూరి నరేందర్ శివ ముదిరాజ్‌తో పాటు ఆయన అనుచరులకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం శివముదిరాజ్ మాట్లాడుతూ.. శక్తి వంచన లేకుండా బీఆర్ఎస్ పార్టీకి నిత్యం కృషి చేశానన్నారు. రాజేంద్రనగర్‌లో పార్టీ అభివృద్ధి కోసం పార్టీ జెండా పట్టుకొని ఇంటింటికీ తిరిగానని ఈ సందర్భంగా గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమంలో ఇంటిని సైతం వదిలి ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నానని, రాష్ట్రం ఏర్పడి ఇన్నేళ్లు అవుతున్నా.. తనకు ఎలాంటి గుర్తింపు లభించలేదన్నారు. 6 గ్యారెంటీ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరామన్నారు. అధికార పార్టీకి డిపాజిట్లు కూడా దక్కకుండా చేసి ఈ అసెంబ్లీ ఎన్నికల్లో కస్తూరి నరేందర్ ముదిరాజ్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు నాగేందర్ రెడ్డి, అత్తాపూర్ డివిజన్ అధ్యక్షులు ముద్దగౌని భాస్కర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ విజయం ఖాయం

ఆత్మీయ సమ్మేళనంలో ప్రభుత్వవిప్ గాంధీ



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాంధీ

రాయదుర్గం: రాష్ట్రంలో బీఆర్ఎస్ మూడవసారి విజయం సాధించడం ఖాయమని ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ధీమా వ్యక్తం చేశారు. కొండాపూర్ డివిజన్‌లోని నాగార్జున రెసిడెన్సీ కాలనీవాసులతో శనివారం ఆత్మీయ సమ్మేళనంను నిర్వహించారు. అందరి ఆశీర్వాదంతో మరోసారి విజయం సాధించి శేరిలింగంపల్లిని మరింత అభివృద్ధి చేసుకోవడానికి అవకాశం కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ షేక్ హమీద్‌పటేల్, రెసిడెన్సీ ప్రతినిధులు రామరాజు, సత్యనారాయణరాజు, పార్టీ నాయకులు చంద్రశేఖర్‌ప్రసాద్, రామరాజు తదితరులు పాల్గొన్నారు.

హఫీజ్‌పేట్ : హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని ప్రజయ్ సిటి కాలనీలో ఎమ్మెల్యే గాంధీ ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు.

అన్ని రంగాల్లో మహిళలకు ప్రాధాన్యం



గోపన్‌పల్లిలో మహిళలతో మాట్లాడుతున్న మాజీ కార్పొరేటర్ సాయిబాబా

రాయదుర్గం: మహిళా సమస్యల పరిష్కారంలో బీఆర్ఎస్ పార్టీ ముందుందని గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టిసాయిబాబా పేర్కొన్నారు. అన్ని రంగాలలో మహిళలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఈ గచ్చిబౌలి డివిజన్‌లోని గోపన్‌పల్లిలోని వీకర్ సెక్షన్ కాలనీవాసులు, మహిళా సంఘం సభ్యులతో ఆయన శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే గాంధీ హయాంలో గత తొమ్మిదిన్నర ఏళ్ళలో ఎంతో అభివృద్ధి జరిగిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాజునాయక్, రాగం జంగయ్య యాదవ్, శంకరిరాజు ముదిరాజ్, రాణి, ఆసియా, బబ్లూనాయక్, వినోద్‌నాయక్ పాల్గొన్నారు.

గ్యార్వీ షరీఫ్ వేడుకలు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి తారానగర్‌లో గ్యార్వీ షరీఫ్ వేడుకలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ వేడుకల్లో ప్రభుత్వ విప్ ఆరికెపూడి గాంధీ, కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ మతసామరస్యానికి ప్రతీక గ్యార్వీ షరీఫ్ అని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే గాంధీని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ వీరేశంగౌడ్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు రాజుయాదవ్, నాయకులు ఉరిటి వెంకట్రావ్, చింతకింది రవీందర్‌గౌడ్, పద్మారావు, ప్రవీణ్, రవీందర్‌రెడ్డి గోపాల్‌యాదవ్, ఖాజాపాష, అజీమ్, అస్లాం, గఫార్ పాల్గొన్నారు.

ముగిసిన పోస్ట్ కాంగ్రెస్-2023 సదస్సు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఇంటర్నేషనల్ యూనియన్ ఆఫ్ ఆంత్రోపాలజికల్ అండ్ ఎథ్నోలాజికల్ సైన్సెస్ (ఐయూఏఈఎస్), హెచ్‌సీయూ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఆంత్రోపాలజీ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన రెండు రోజుల సదస్సు శుక్రవారం రాత్రి ముగిసింది. ముగింపు సమావేశంలో ది బ్రిటీష్ యూనివర్సిటీ ఈజిప్ట్‌లోని సైబర్ సెక్యూరిటీ సైబర్‌క్రైమ్స్ ప్రోగ్రామ్ డైరెక్టర్ డాక్టర్ మహ్మద్ ఎల్ గిండి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా సైబర్ నేరాల సంఖ్య పెరుగుతున్నాయని, వాటిని అరికట్టే ప్రయత్నం కొనసాగిస్తున్నారన్నారు .డిజిటలైజ్‌లో మరింత వేగం పెరగాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభ కార్యక్రమంలోయూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ లండన్ ప్రొఫెసర్ డానియల్ మిల్లర్, జపాన్ ఓసాకా యూనివర్సిటీ జుంజి కోయిజుమి, హెచ్‌సీయూ ఆంత్రోపాలజీ విభాగం హెడ్ ప్రొఫెసర్ ఎం రొమేష్‌సింగ్, ఆంత్రోపాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ బివిశర్మ, హెచ్‌సీయూ స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ డీన్ డాక్టర్ జ్యోతిర్మయిశర్మ, ఢిల్లీ యూనివర్సిటీ ఆంత్రోపాలజీ విభాగం హెడ్ ప్రొఫెసర్ ఎస్ఎన్ పట్నాయక్, ప్రొఫెసర్లు, విద్యార్థులు, అధికారులు పాల్గొన్నారు.